క్లుప్తంగా

క్రీడల్లో ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: అనంతపురం జేఎన్‌టీయూ అంతర కళాశాలల క్రీడా పోటీల్లో విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు సత్తాచాటి విజేతలుగా నిలిచినట్టు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా కలికిరిలో 12వ జేఎన్‌టీయూఏ అంతర కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. టేబుల్ టెన్నిస్ మెన్ సింగిల్స్, డబుల్స్‌లో ఏ.చందు, కే.వంశీధర్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ ఉమెన్ సింగిల్స్‌లో ఎస్.చందన ప్రథమ స్థానంలో నిలిచారు. హ్యాండ్‌బాల్ విభాగంలో ఉమెన్ జట్టు విజేతగా నిలిచిందన్నారు. వారిని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, పీడీ మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన



విద్యాసామగ్రి అందజేస్తున్న ఎంఈవో శైలజ

ఓజిలి: ప్రభుత్వ పాఠశాలలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తున్నట్టు ఎంఈవో శైలజ తెలిపారు. ఆమె సోమవారం మైసూరు నుంచి వలస వచ్చి రాజుపాళెంలో నివాసం ఉంటున్న వారి పిల్లలు 12 మందిని రాజుపాళెం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రామా ల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టామన్నారు. అనంత రం పిల్లలకు పలకలు, నోట్‌బుక్కు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీవీఆర్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

కోట: మండలంలోని చిట్టేడు వద్ద ఉన్న జీవీఆర్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జీవీఆర్ సంస్థల వ్యవస్థాపకుడు గ్రంధి వెంకటేశ్వరరావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఉద్యోగులు, కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదానం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఆర్ ఎండీ చల్లారావు, జీఎం క్రిష్ణన్ పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.23.11 లక్షలు



సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు సమక్షంలో సోమవారం హుండీలోని కానుకలు లెక్కించారు. 47 రోజులకు గాను రూ.23,11,485 మేర వచ్చినట్టు వెల్లడించారు. ఇందులో మలేషియా 1 రింగిట్, యూఎస్ఏ డాలర్స్ 20, కెనడా డాలర్స్ 20, 95 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ బీ.ప్రసన్నలక్ష్మి తెలిపారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.11,85,692

చిల్లకూరు : తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.11,85,692 ఆదాయం వచ్చినట్టు ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి ఆలయంలో జాతర నిర్వహించనున్న నేపథ్యంలో హుండీలోని కానులను అధికారులు, సిబ్బందితో కలిసి లెక్కించినట్టు తెలిపారు. మల్లాం ఆలయ ఈవో శశాంక్ పాల్గొన్నారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ నూతన కార్యవర్గం ఎన్నిక



సూళ్లూరుపేట : సూళ్లూరుపేట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణంలోని అలవల రోటరీ నేత్ర వైద్యశాల కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లా మెడికల్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాముగుప్తా ఆధ్వర్యంలో సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సూళ్లూరుపేట మెడికల్ షాప్స్‌కు సంబంధించి అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీహరి, కార్యదర్శిగా కుమారస్వామి, జాయింట్ సెక్రటరీగా రాజశేఖర్, కోశాధికారిగా మదన్‌మోహన్, కార్యవర్గ సభ్యులుగా మరో ఆరుగురు ఎన్నికయ్యారు.

ఇద్దరు యువకులపై కేసు నమోదు

దక్కిలి: దక్కిలి మెయిన్ రోడ్డు సెంటరులో బైక్‌లను అతివేగంగా నడిపిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివశంకర్ సోమవారం తెలిపారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. లైసెన్సు లేకపోవడంతోపాటు వాహనాలను అతివేగంగా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


అభివృద్ధి.. మాటలకే పరిమితం

పక్షుల సంరక్షణ కేంద్రమైన నేలపట్టులో సందర్శకులు, పక్షి ప్రేమికుల కోసం నిర్మించిన టూరిజం సముదాయం అభివృద్ధి మాటలకే పరిమితమైంది. సూళ్లూరుపేట కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పక్షుల పండుగ (ఫ్లెమింగో ఫెస్టివల్) సమయంలో టూరిజం సముదాయాలను వినియోగంలోకి తీసుకువస్తామన్న జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మాటలు నీటి మీద రాతలుగా మారాయి. రూ.లక్షలతో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరి బూత్ బంగ్లాలుగా మారినా పట్టించుకునే నాథుడు లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- పక్షుల పండుగలో హడావుడి
- శిథిలావస్థలోనే టూరిజం సముదాయం
- నెరవేరని జిల్లా కలెక్టర్ హామీ



శిథిలావస్థకు చేరిన ఉడెన్ కాటేజెస్



తుప్పు పట్టి నిరుపయోగంగా మారిన వాచ్ టవర్

దొరవారిసత్రం : మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి వచ్చే సందర్శకులు, పర్యాటకుల సౌకర్యార్థం ప్రభుత్వం స్వదేశీ సందర్శయాన్ పథకం(2017–18) కింద రూ.3.18 కోట్లతో పలు భవనాలు నిర్మించింది. ఇందుకోసం రైతుల నుంచి 10 ఎకరాల సీఎఫ్ఎస్ భూములను బలవంతంగా తీసుకున్నారు. టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంతో అందంగా ఆరు ఉడెన్ కాటేజెస్, అన్ని సదుపాయలతో కూడిన రెస్టారెంట్, పక్షుల పండుగ సీజన్‌లో సందర్శకుల కోసం పెద్ద వాచ్ టవర్, వాహనాల పార్కింగ్, అందరినీ ఆకట్టుకునేలా ఫుట్‌పాత్, సోలార్ లైట్లు, బెంచీలు, గ్రీన్ గార్డెన్ తదితరాలు చేపట్టారు. ఇందులో ఒక్కటి కూడా వినియోగంలోకి తీసుకురాకుండానే వదిలేశారు. దీంతో అన్ని భవనాలు నిరుపయోగంగా మారి క్రమేపి శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం టూరిజం హోటల్ చెందిన రూఫ్‌టాప్‌కు వేసిన పెంకులు దెబ్బతిని పడిపోయాయి. అదే విధంగా వాచ్‌టవర్ తుప్పుపట్టి కూలే స్థితికి చేరింది. వీటితో పాటు ఉడెన్ కాటేజెస్ చెదులు పట్టి ఎందుకు పనికిరాకుండా పోయాయి. వీటితో పాటు డీవీ సత్రంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న టూరిజం హోటల్, కాంప్లెక్స్ తదితరాలు కొన్నేళ్లుగా వినియోగంలోకి రాకుండానే ఎందుకూ పనికిరాకుండా దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మందు బాబులకు అడ్డాగా, రాత్రిళ్లు అసాంఘిక కార్యకలపాలకు నిలయాలలుగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

హామీ గురించి పట్టించుకోని కలెక్టర్

పక్షుల పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి వచ్చారు. టూరిజం హోటల్, ఉడెన్ కాటేజెస్, పెలికాన్ అతిథి గృహాలను అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. పండుగ సమయంలో అందరూ హడావుడి చేశారు. తర్వాత పట్టించుకోలేదు. పక్షుల పండుగ సందర్భంగా పక్షుల కేంద్రం సమీపంలో ఉన్న పెలికాన్ అతిథి గృహాలకు మాత్రం మరమ్మతులు చేసి రంగులు వేశారు.

భవనాలను అందుబాటులోకి తేవాలి



పక్షుల కేంద్రానికి వెళ్లే మార్గంలో నిర్మించిన రెస్టారెంట్, కాటేజెస్ తదితరాలను బాగు చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలి. బయట ప్రాంతాల నుంచి పక్షులను వీక్షించేందుకు వచ్చే వారికి ఇక్కడ ఎలాంటి సదుపాయాలు లేవు. కనీసం భోజనం కూడా దొరకడం లేదు. తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

\- శ్రీనివాసులు, మహేంద్ర, నెల్లూరు

బాధగా ఉంది



పక్షుల కేంద్రానికి వెళ్లే మార్గంలో రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన టూరిజం కాటేజెస్, రెస్టారెంట తదితర భవనాలు వినియోగంలోకి రాకుండానే శిథిలం అవుతున్నాయి. వాటిని చూసినప్పుడు బాలా బాధ కలుగుతుంది. వాటిని బాగు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా ఫలితం లేదు.

\- కర్లపుడి రామయ్య, సర్పంచ్, నేలపట్టు

నేడు దక్కిలిలో డీఎల్‌పీవో విచారణ

దక్కిలి: పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య తనకు సమాచారం ఇవ్వకుండానే అభివృద్ధి పనులు చేస్తున్నారని, గిరిజన మహిళ అయిన తన హక్కులకు భంగం కలిగిస్తున్నారని పేర్కొంటూ దక్కిలి సర్పంచ్ శనగా వేమక్క జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గూడూరు డీఎల్‌పీవో మంగళవారం విచారణ చేపట్టనున్నారు. ఈ మేరకు నోటీసులను సోమవారం సంబంధిత అధికారులకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని మన్నేముత్తేరి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు సరఫరా ఉండదని ఏఈ పూర్ణిమ తెలిపారు. కోళ్లమిట్ట, కస్పారెడ్డి పాళెం, బాపూజీ కాలనీ, వై జంక్షన్, షార్ బస్టాండ్, గురుకుల పాఠశాల, పందలగుంట, దేగల పాళెం, కుదిరి, ఆబాక, సామంతమల్లం, మన్నేముత్తేరి గ్రామా ల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

30 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

సూళ్లూరుపేట : పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వున్న రామాలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 6 వరకు శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు సీతారాముల ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కారంచేటి మల్లికార్జున్ శర్మ తెలిపారు. స్వామి వారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని, నవమి రోజున సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి పెంచలరెడ్డి, నెల్లూరు మాజీ కార్పొరేటర్ నూనె మల్లికార్జున్‌యాదవ్, కావలి మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్ కుమార్ యాదవ్ హాజరుకానున్నట్టు తెలిపారు.

గ్రీవెన్స్‌కు సమస్యల వెల్లువ

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ శైలకుమారి నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు ప్రజలు అర్జీలు అందజేశారు. వాటిలో పట్టాదారు పాసు పుస్తకాలు, 1బీ, అడంగళ్లలో చేర్పులు, మార్పులు, పింఛన్, పక్కా గృహాల మంజూరు తదితరాలు ఉన్నట్టు తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన తెలిపారు. కార్యక్రమంలో ఏఈ మోహన్‌రావు, ఏఈలు హరికృష్ణ, మెహతాజ్, ఉమామహేశ్వరి, ఏపీఎం మునిరాజ, సూపర్‌వైజర్ హేమలత పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ఓజిలి: రసాయనిక ఎరువులు వాడకుడా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహార ఉత్పత్తులు తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంఈవో శైలజ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ఆహార ఉత్పత్తుల ప్రదర్శనతోపాటు విక్రయాలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులకు బదులు కషాయాలు, ఘన జీవామృతం, పశువుల ఎరువులు తదితరాలతో పండించిన కూరగాయలు తింటే వ్యాధులు రావన్నారు. డీఎంలు వీరరాఘవయ్య, ఓజిలి ఇన్‌చార్జి జైతున్‌బీ, సిబ్బంది రాజేష్, గురవయ్య, చెంచమ్మ, ప్రశాంతి, మాధురి, సాయిప్రియ, షబానా, రేవతి, సుమతి, చెంచులక్ష్మి, సిద్దమ్మ, ఉమానారాయణ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



కాకాణితో మాట్లాడుతున్న నేదురుమల్లి

వెంకటగిరి రూరల్ : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు ఎళ్లవేళలా అండగా ఉంటామని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం రెండో రోజు వెంకటగిరిలోని తన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న రాజకీయ కక్షసాధింపు చర్యలకు భయపడొద్దన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కష్టపడిన వారికి గుర్తింపు ఇస్తామన్నారు. తిరిగి మన ప్రభుత్వం వస్తుందని, తప్పు చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది అవుతున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, నక్కా దుర్గాప్రసాద్, నాగయ్య, పాదిలేటి దశరథరామిరెడ్డి, యస్థానిబాషా, రాజారెడ్డి, మల్లిరెడ్డి, అల్లంసాయి, శ్రీనివాసరాజు, పంజాం ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడితో నేదురుమల్లి

సైదాపురం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సోమవారం డైకస్ రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

టీబీ రహిత పంచాయతీగా వేపినాపి



వైద్యాధుకారుల అందించిన మెడల్స్, ప్రసంసాపత్రాలతో రాపూరు మండల వైద్యసిబ్బంది

రాపూరు : టీబీ రహిత పంచాయతీగా మండలంలోని వేపినాపి ఎంపికైె నట్టు వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రమీలా రాజకుమారి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత, అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి చేతుల మీదుగా మెడల్, ప్రసంసా పత్రం అందుకున్నట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ వేపినాపి పంచాయతీలో పలు కార్యక్రమాలు చేపట్టి క్షయవాధిపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. 2023–2024లో ఒక క్షయవ్యాధి కేసు కూడా నమోదు కాలేదన్నారు. టీబీ రహిత పంచాయతీగా కంచు మెడల్, ప్రశంసా పత్రం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. వైద్య సిబ్బంది శైలమ్మ, భార్గవి, వరదయ్య, పుల్లారత్నం, విజయలక్ష్మి, రమణమ్మ, రాధకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలి

చిట్టమూరు : ప్రజలు సెల్ ఫోన్ వాడకాన్ని తగ్గించాలని హైదరాబాద్ నిజాం కాలేజీకు చెందిన ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రమేష్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు సెల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 1.6 కంటే ఎక్కువగా రేడియేషన్ కలిగిన ఫోన్లు వాడడం మంచిదికాదన్నారు. రాత్రిళ్లు ఫోన్లను తలకింద పెట్టుకుని నిద్రించరాదని సూచించారు. ఫోన్లను జేబులో పెట్టుకోకుండా ప్యాంట్ పాకెట్ పాచ్‌లో ఉంచుకోవాలన్నారు. బ్లూటూత్ కన్నా, ఇయర్ ఫోన్స్ వాడడం మంచిదన్నారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే క్షయవ్యాధి నియంత్రణ



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



నాయుడుపేట టౌన్ : ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఓజిలి: తగిన జాగ్రత్తలు పాటిస్తే క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని వైద్యాధికారిణి టీ ప్రవీణ తెలిపారు. మండలంలోని అత్తివరం పీహెచ్‌సీలో సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నిర్మూ లన దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో ఏపీఎస్ రాజగోపాల్, ఏఎన్‌ఎం కుసుమకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ : క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్యులు సుబ్బారావు పిలుపునిచ్చారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ఎల్‌ఏ సాగరం అర్బన్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, వైద్యులు పట్టణంలో ర్యాలీ చేశారు. క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే తుమ్మూరు అర్బన్ హెల్త్ క్లినిక్, సీహెచ్‌సీ, గొట్టిప్రోలు పీహెచ్‌సీ, సచివాలయల వద్ద ఉన్న గ్రామీణ ఆరోగ్య కేంద్ర వద్ద ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయుడుపేట టీబీ విభాగం సూపర్‌వైజర్ బొమ్మన రమణయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

సూళ్లూరుపేట రూరల్ : రైతుల సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ సదస్సులు నిర్వహిస్తునట్లు డిస్కం ఏఈ పూర్ణిమ తెలిపారు. ఆమె సోమవారం సూళ్లూరుపేట మండలం మన్నేముత్తేరి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రైతులతో సదస్సు నిర్వహించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందును బహిష్కరించాలి

గూడూరు రూరల్ : సీఎం చంద్రబాబునాయుడు వక్ఫ్ సవరణ బిల్లుపై మౌనంగా ఉండి ముస్లింలను మోసం చేయాలని చూస్తున్నారని వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దుమ్ మొహిద్దీన్ ఆరోపించారు. ప్రస్తుతం వారి స్వప్రయోజనాల కోసం ఇఫ్తార్ విందులు ఇస్తున్నారని విమర్శించారు. వక్ఫ్ బోర్డులను నిర్వీర్యం చేయడానికి చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్, చిరాగ్ పాశ్వాన్ తదితరులు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మళ్లీ ముస్లింలపై కపట ప్రేమ చూపుతూ ఇఫ్తార్ విందులు ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు. వాటిని ముస్లింలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్

వాకాడు : క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకుని సరైన సమయంలో మందులు వాడితే క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని బాలిరెడ్డిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రంగదీప్తి తెలిపారు. వాకాడు సచివాలయం పరిధిలోని గొల్లపాళెంలో సోమవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ మామోగ్రామ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు హరిత, పద్మావతి, సిబ్బంది కొండమ్మ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

కాలువలు నిర్మించాలని ఆందోళన



మురుగునీటి బాటిళ్లతో బైఠాయించిన భూపయ్య కాలనీ వాసులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని భూపయ్య గిరిజన కాలనీలో మురుగు కాలువలు నిర్మించాలని స్థానికులు కోరారు. వారు సోమవారం నాయుడుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కాలనీలో కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్ల మీదే ప్రవహిస్తోందన్నారు. దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. అంతకుముందు వారు మురుగు నీటిని బాటిళ్లలో పట్టుకుని సీపీఎం, సీఐటీయూ నాయకులతో కలిసి కార్యాలయం వద్దకు ర్యాలీ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు వినతి పత్రం అందజేశారు. కాలనీని పరిశీలించి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని హజరత్ అమీర్‌షావలి ఉరుసు గంధోత్సవాన్ని మతసామరస్యానికి ప్రతీకగా ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె సోమవారం మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి దర్గా వద్ద నాయకులు, కమిటీ సభ్యులతో కలిసి ఉరుసు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో వివాదాలకు తావులేకుండా కమిటీ సభ్యులు సమష్టిగా ఉరుసు నిర్వహించాలని సూచించారు. అంతకుముందు ముజావర్లు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, పార్థసారథి, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్ పాల్గొన్నారు.

అండగుండాలకు తాగునీరు

తడ: మండలంలోని అండగుడండాల గ్రామస్తులకు తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హామీ ఇచ్చారు. ఆమె సోమవారం రోడ్డును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గతంలో మంజూరైన రోడ్డు టెండరును రద్దు చేసి కొత్త టెండరు పిలిచేందుకు కొంత ఆలస్యమైందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మురళిరెడ్డి, సెల్వం, జనార్ధన్‌రెడ్డి, రాజారెడ్డి, రవి, చంద్రయ్య పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త అరెస్టు

నాయుడుపేట టౌన్ : భార్యపై కత్తితో దాడి చేసిన కేసులో భర్త వేముల సురేష్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ బాబి తెలిపారు. నాయుడుపేట పట్టణం కుమ్మరివీధిలో సురేష్, పూజలత దంపతులు నివాసమున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేష్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. పనికి సక్రమంగా వెళ్లకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. దీంతో దంపతులు తరచూ గొడవపడుతున్నారు. గత నెల 22న ఇద్దరూ గొడవ పడ్డారు. మద్యం మత్తులో ఉన్న సురేష్ ఇంటిలో ఉన్న కత్తి తీసుకుని భార్య పూజలతపై దాడి చేశాడు. అనంతరం అదే కత్తితో తాను పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి రమేష్‌ను సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

చిల్లకూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు సర్వసభ్య సమావేశాలకు రావడంలేదు. క్రమంలోనే సోమవారం చేపట్టిన మండల సమావేశానికి 12 మంది సభ్యులు హాజరుకావాల్సి ఉండగా ఎంపీపీ, ఇద్దరు సభ్యులు మాత్రమే వచ్చారు. ఎంపీడీవో గోపి, అధికారులు గంటల తరబడి చూసినా ఎవరూ రాకపోవడంతో కోరం లేనట్టు ప్రకటించి వాయిదా వేశారు. వైఎస్సార్ సీపీ ఎంపీపీ అధికార పార్టీ నాయకుడు చెప్పినట్టు నడుకుంటుండడంతోనే సభ్యులు రావ డం లేదని తెలిసింది. నిధుల కేటాయింపులోనూ వివక్ష చూపుతున్నట్టు ఆరోపిస్తున్నారు. ఎంపీటీసీల సెగ్మెంట్లలోని సమస్యలు పరిష్కరించేందుకు నిధులు కేటాయించాలని వారు కోరుతున్నారు.

జగనన్న లేఅవుట్లపై మళ్లీ విచారణ

కలువాయి(సైదాపురం) : మండల కేంద్రమైన కలువాయిలోని జగనన్న లేఅవుట్లపై సోమవారం సమగ్ర విచారణ మొదలైంది. ఇందులో భాగంగా స్పెషల్ క్వాలిటీ కంట్రోల్ అధికారి రాజా పర్యవేక్షణలో గతంలో ఉపాధి హామీ పథకంలో పనిచేసిన టీఏలు సాంబశివరావు, నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కొలతలు తీశారు. వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ కొలతలు వేసి పనుల్లో నాణ్యతపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

రొయ్యల గుంతలకు చెరువు నీరు



తూముగుండా రొయ్యల గుంతలకు పోతున్న చెరువు నీరు



పంట కాలువ నుంచి రొయ్యల గుంతలకు అమర్చిన పైపులు

చిట్టమూరు : మండలంలోని ఆరూరు పెద్ద చెరువు నీటిని రొయ్యల గుంతలకు తరలిస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రైతులు ఎడగారు వరి పంటను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొంతమంది గ్రామంలో గుంతలను లీజుకు తీసుకుని రొయ్యలు సాగు చేస్తున్నారు. వాటి వద్ద బోర్లలో ఉప్పు నీటి శాతం, హార్డ్‌నెస్ పెరగడంతో రొయ్యల ఎదుగుదల లేదు. ఈ క్రమంలో చెరువు నీటిని తరలిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వరి పంటకు నీరు సరిపోదని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ అబ్దుల్ ఘనిని వివరణ కోరగా చెరువు నీటిని రొయ్యల గుంతలకు తరలించకుండా తూములు కట్టించామన్నారు. టీడీపీ ముఖ్య నేత ఆదేశాలతోనే కూటమి నేతలు రొయ్యల గుంతలకు నీరు తరలించుకుంటున్నారని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

వైద్య సేవ ఫీల్డ్ ఉద్యోగుల నిరసన

నాయుడుపేట టౌన్ : సమస్యలను సత్వరం పరిష్కరించి న్యాయం చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ ఉద్యోగులు కోరారు. వారు నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఆ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసులు మాట్లాడుతూ మూడు వారాలుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ప్రజా సమస్యల ఫిర్యాదు వేదికలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.

పొలాల్లోకి దారి ఏర్పాటు

కలువాయి(సైదాపురం) : మండలంలోని బ్రాహ్మణపల్లిలో రైతులు వరి కోతలు కోసుకునేందుకు వీలుగా రెవెన్యూ అధికారులు సోమవారం దారి సౌకర్యం కల్పించారు. గ్రామానికి చెందిన రైతులు సుమారు 50 ఎకరాల్లో వరి సాగుచేశారు. ప్రస్తుతం కోతలు మొదలయ్యాయి. పొలంలోకి వరికోత మిషన్ వెళ్లకుండా మంగళ చిన్నయ్య అడ్డుకున్నాడు. ఈ విషయాన్ని రైతులు ఇటీవల నెల్లూరు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జిల్లా కలెక్టర్ రైతులకు దారి సౌకర్యం కల్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకుని దారి సౌకర్యం కల్పించారు. వారికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గూడూరు : 90108 97733, 99122 20591
వెంకటగిరి : 99122 20591
సూళ్లూరుపేట : 90102 23710